క్లుప్తంగా

మేధా టాలెంట్ టెస్టులో ప్రతిభ

దండేపల్లి: మేధా చారిటబుల్ ట్రస్టు వారు నిర్వహించిన టాలెంట్ టెస్టులో దండేపల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముత్యాల మనూష ప్రతిభ కనబరచడంతో ఆమెను హైదరాబాద్‌లోని మల్లంపేట ఎస్ఆర్ కాలేజీకి, గుడిరేవు ఉన్నత పాఠశాలకు చెందిన గంగధరి అంజిని హైదరాబాద్‌లోని చైత్ర జూనియర్ కాలేజీకి ఎంపిక చేశారు. వీరికి ఆరేళ్లపాటు అయ్యే విద్యా, వసతి ఖర్చులను మేధాచారిటబుల్ భరిస్తుందని పాఠశాలల హెచ్ఎంలు చిన నర్సయ్య, శ్రీనివాస్ వేర్వేరుగా తెలిపారు.

కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 6,7 తరగతులతో పాటుగా ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం ఆసక్తి, అర్హత గల వారు అడ్మిషన్ చేసుకోవాలని ఎస్వో మంజుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7లో 20 సీట్లు, ఇంటర్మీడియట్‌లో ఎంఎల్‌టీలో 40, కమర్షియల్ గార్మెంట్‌లో 40 సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

తునికాకు సేకరణ ప్రారంభం


కల్లంలో ఆరబెట్టిన తునికాకు

కోటపల్లి: మండలంలో తునికాకు సేకరణ శనివారం నుంచి ప్రారంభమైంది. వెంచపల్లి యూనిట్ పరిధిలో 1700 స్టాండర్డ్ బ్యాగులు తునికాకు సేకరించాల్సి ఉంది. దీని పరిధిలో ఆరు కల్లాలను ఏర్పాటు చేయగా.. ఆలుగామ, వెంచపల్లి, సుపాక, జనగామ, రాచర్ల, నందరాంపల్లి గ్రామాల పరిధిలో కల్లం సేకరణ చేపట్టాలని ప్రకటించగానే గ్రామస్తులంతా ఉదయం అటవీ బాట పట్టారు. 50 తునికాకట్టా రూ.3.30 ఇవ్వనున్నట్లు రేంజర్ సదానందం తెలిపారు. గతంలో లాగా కాకుండా ఈసారైనా ఆకుల పైసలు చెల్లించే విధానంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం

కాసిపేట: మండలంలోని సోమగూడెం చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితిష్ కుమార్‌ల దిష్టిబొమ్మతలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీహార్‌లోని దర్భంగాలో అంబేడ్కర్ హాస్టల్‌లో దళిత విద్యార్థులను రాహుల్‌గాంధీ కలవనీయకుండా రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టడం బీజేపీ నియంత పాలనకు నిదర్శనమన్నారు. రాహుల్ గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసీ ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం పర్యటనలను అడ్డుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నం ప్రదీప్, బామండ్ల రాకేశ్, కారుకూరి రాంచందర్, ముత్తె భూమయ్య, మైదం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ కమిటీని ఆదివారం యాదవ సంఘం భవనంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బోయిని తిరుపతి యాదవ్, అధ్యక్షుడిగా మారం లచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షుడిగా వేల్పుల రవి, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల అనిల్ కుమార్, కోశాధికారిగా రేషవేణి స్వామి, జాయింట్ సెక్రెటరీగా బోయిని హనుమంతు, ప్రచార కార్యదర్శిగా మారం కుమార్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన మండల కమిటీ నాయకులను ఘనంగా సన్మానించారు. వీలైనంత త్వరగా ఆలయ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

'మట్టి తరలింపును అడ్డుకోవడం సరికాదు'

జన్నారం: వర్షకాలం రాకముందే పొలాల్లో చెరువులోని మట్టి వేసుకుంటే భూమి సారవంతంగా ఉంటుందని, పంటకు బలం ఉంటుందనే ఉద్దేశంతో మట్టి వేసుకుంటే ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్టి తరలింపును అడ్డుకోవడం సరికాదని రైతులు రాజేశ్వర్ రావు, తోట లచ్చన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కొత్తపేట చెరువులో అటవీ బార్డర్‌కు 400 మీటర్ల దూరంలో చెరువు మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తే మాజీ ఎంపీటీసీ ఇచ్చిన సమాచారం అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. రైతులకు సాయం చేయాల్సింది పోయి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో రైతులు దుబ్బయ్య, రవి, చంద్రగౌడ్, బుచ్చన్న, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నీడన సేద తీరి!



దండేపల్లి: ఎండ దంచికొడుతుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రత వేడెక్కుతుంది. ఎండ వేడికి మనుషులే కాదు, పశువులు కూడా అల్లాడుతున్నాయి. మేతకు వెళ్లిన మూగజీవాలు మిట్ట మధ్యాహ్నం చెట్టు నీడకు చేరి సేద తీరుతున్నాయి. ఈ దృశ్యాన్ని సాక్షి, క్లిక్‌మనింపింది.

ప్రమాదకర మూల మలుపులు

భీమారం మండలంలోని పలు గ్రామాల రోడ్లు ప్రమాదకరంగా మారాయి. మంచిర్యాల– చెన్నూరు జాతీయ రహదారిపై మాంతమ్మ దేవాలయం, జోడువాగుల వద్ద, భీమారం– నెన్నల రహదారిపై కొత్తగూడెం, బూర్గుపల్లి వద్ద ప్రమాదకరమైన మూల మలుపులున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – భీమారం



ఘనంగా హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియా సమీపంలో గల శ్రీపంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ రజతోత్సవాల్లో భాగంగా ఆదివారం మిథిలా పాంగణంలో పట్టణ ప్రజల శాంతి కోసం హోమం, యాగం నిర్వహించారు. దేవనాథ రామానుజ చినజీయర్‌స్వామి వారి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యులు తెలిపారు. ఈనెల 22 వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మార్కెట్ రోడ్లకు మహర్దశ

- అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, విద్యుత్ సరఫరా
- రోడ్డు విస్తరణతో ట్రాఫిక్‌కు చెక్


రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ రోడ్లకు మహర్దశ పట్టనుంది. మార్కెట్‌లోని రోడ్లపై ఇక విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు కనిపించవు. డ్రెయినేజీ కంపు ఉండదు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండవు. మంచిర్యాల మార్కెట్ రోడ్డు, వెంకటేశ్వర టాకీస్ రోడ్డు, శ్రీనివాస టాకీస్ రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు, శ్రీవిశ్వనాథ ఆలయం రోడ్డు విస్తరణ పనులతో పాటు, భూగర్భ మురికి కాల్వ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, భూగర్భ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు కోసం రూ. 78 కోట్ల నిధులు కేటాయించారు. రోడ్డు వెడల్పు కోసం ఇప్పటికే రోడ్డును ఆక్రమించి ఉన్న భవనాల కూల్చివేతలు ముగిశాయి. రోడ్డు వెడల్పుకు అవసరమైన స్థలాన్ని ఆయా యజమానులు వదిలేశారు. ఇకపై రోడ్డు వెడల్పు పనులను చేపట్టడమే తరువాయి కాగా.. అందుకు సంబంధించిన నిధులు విడుదల కావడంతో జూన్‌లో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రెయినేజీ వ్యవస్థతో పాటు, విద్యుత్ స్తంభాలు సైతం రోడ్డుపై అడ్డుగా ఉండడం వల్ల రోడ్డు వెడల్పు పనులకు ఆటంకం రాకుండా భూగర్భ డ్రెయినేజీ నిర్మించి, విద్యుత్‌ను అండర్‌గ్రౌండ్ ద్వారా సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తొలగనున్న ట్రాఫిక్ సమస్య..

మంచిర్యాల పట్టణంలోని మార్కెట్‌రోడ్డు 60 ఫీట్ల వెడల్పుతో ఉండాల్సి ఉండగా. అక్కడ నిర్మించే దుకాణ సముదాయాలు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి నిర్మించారు. దీంతో వారిఇక మంచిర్యాల కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేయడంతో, ఆక్రమణలను తొలగించారు. రోడ్ల వెడల్పు పనులను ప్రారంభించాల్సి ఉంది. జూన్‌లో పనులను ప్రారంభించి, పూర్తిచేస్తే మంచిర్యాల మార్కెట్‌లోని రోడ్ల స్వరూపమే పూర్తిగా మారనుంది. ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యతో పడుతున్న ఇబ్బందులకు కొంతమేర చెక్ పెట్టేందుకు అవకాశం ఉంది. కూరగాయల మార్కెట్, దుకాణాల సముదాయాలు ఉండగా, పార్కింగ్ కోసం సెల్లార్ గాని, అక్కడే కొంత స్థలాన్ని కేటాయిస్తే, వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రోడ్ల పనులు ప్రారంభించే నాటికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

జూన్‌లో పనులు ప్రారంభిస్తాం



మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని రోడ్ల వెడల్పు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు, ఇతర కేబుళ్లను మార్చే పనులు జూన్‌లో ప్రారంభించనున్నాం. రోడ్లను ఆక్రమించిన వారు వాటిని స్వయంగా తొలగించుకోవడంతో, ఇక రోడ్డు వెడల్పు పనులను చేపట్టాల్సి ఉంది.

– శివాజీ, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్

దళిత ఎంపీని అవమానించడం సరికాదు


నిరసన తెలుపుతున్న నాయకులు

జైపూర్: సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం పర్యాటనకు వచ్చిన సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణను అవమానించడం సరికాదని మాదిగ హక్కుల దండోరా నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాట్లాడుతూ.. ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక ఎంపీ వంశీకృష్ణ ఫొటో ఫ్లెక్సీలో పెట్టకపోవడం దళిత జాతికి అవమానం జరిగిందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఘటనపై స్పందించి మాట్లాడాలన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కదారి రమేశ్, జలంపల్లి భానేశ్, జలంపల్లి సంపత్, కన్నయ్య, మల్లేశ్, సంపత్, రవి, సిద్ధూ, వెంకటేశ్ పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో..

సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం పర్యాటనకు వచ్చిన సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటో ఫ్లెక్సీల్లో పెట్టకపోవడం, ఆహ్వానించకపోవడానికి నిరసనగా జైపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం కాళ్లు కడిగి యాదవ సంఘం నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక ఎంపీ వంశీకృష్ణ ఫొటో ఫ్లెక్సీలో పెట్టకుండా అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'అవినీతిలో నంబర్ వన్‌గా ఎమ్మెల్యేలు'


మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అవినీతిలో నంబర్ 1గా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావులు మార్చారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్‌రావుపై ప్రతిపక్షంలో ఉన్న ప్రేమ్‌సాగర్‌రావు భూకబ్జా, అవినీతి ఆరోపణలను చేశారని, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ప్రేమ్‌సాగర్‌రావుపై దివాకర్‌రావు ఇప్పుడు అవే భూకబ్జా, అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రెండూ అవినీతి పార్టీలేనని అర్థం అవుతుందన్నారు. ఎన్నికల సమయాల్లో దివాకర్‌రావు మంచిర్యాల గోదావరి నదిపై వంతెన, లక్ష్మీ టాకీస్ రాజీవ్‌నగర్‌పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని, నిధులు విడుదల అయ్యాయని క్షీరాభిషేకాలు చేసి గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తన స్వలాభం కోసం బ్రిడ్జిని రద్దు చేయించి, మరో ప్రాంతానికి తరలించారని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, మోటపలుకుల తిరుపతి, తుల ఆంజనేయులు, బియ్యాల సతీశ్‌రావు, జోగుల శ్రీదేవి, మాధవరపు వెంకట రమణరావు, అమరిశెట్టి రాజ్ కుమార్, గడ్డం స్వామిరెడ్డి, వీరమల్ల హరిగోపాల్, సుజాత పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి


రైతులకు భూసార కార్డులు అందజేస్తున్న అధికారులు

నెన్నెల: ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షలతో నేలలోని సారాన్ని బట్టి ఎరువులు వాడుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని నెన్నెల ఏఈవో రాంచందర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ జగిత్యాల జిల్లా పొలాస కళాశాల ఇన్‌సర్వీస్ విద్యార్థులు చేసిన భూసార పరీక్ష ఫలితాల కార్డులను ఆదివారం గంగారాం గ్రామ రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలని రైతులు రసాయనిక ఎరువులను ఇష్టారీతిన వాడుతుండటంతో నేలలు రసాయన సమతుల్యాన్ని కోల్పోయి నిస్సారవుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు రైతులు పాటుపడాలని కోరారు. ఫలితాల ఆధారంగా అవసరమైన ఎరువులను వాడాలన్నారు. ఇన్‌సర్వీస్ విద్యార్థులు దుర్గం శ్రీధర్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

'ప్రాణభయం ఉంది కాపాడండి'



మాట్లాడుతున్న రాజబాబు, స్వప్న దంపతులు

శ్రీరాంపూర్: ఇద్దరు స్థానికుల నుంచి ప్రాణభయం ఉందని వారి నుంచి రక్షణ కల్పించాలని మంతెన రాజబాబు స్వప్న అనే దంపతులు పోలీసులను కోరారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంకు చెందిన తాము 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం శ్రీరాంపూర్‌కు వచ్చి నివాసం ఉంటున్నామన్నారు. చింతకింద మల్లేశ్ ఇంట్లో అద్దెకు ఉంటూ వడ్రంగీ పని చేస్తున్నామన్నారు. రెండు నెలల క్రితం తమ ఇంటి పక్కన ఉన్న ఓ కిరాణ షాపులోని కప్‌బోర్డులను సంపత్ అనే ఇద్దరు మామా అల్లుళ్లు కొనుగోలు చేసి తమ అద్దెకు ఉంటున్న ఇంటి పక్క గదిలో పెట్టారని, ఇంటి యాజమానికి వాటిని బయట పెట్టాలని చెబితే బయట పెట్టామన్నారు. దీంతో వారు మాపై దాడి చేసి కులం పేరుతో దూషించారన్నారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. అప్పటి నుంచి తమపై వారు కక్షగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 18న మరోసారి దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు తమకు రక్షణ కల్పించాలని దంపతులు కోరుతున్నారు.

సరస్వతి పుష్కరాలకు తరలిన భక్తులు


కాళేశ్వరానికి వెళ్లే బస్సుల రద్దీ

భీమారం: కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాలకు భీమారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పుష్కర స్నానాలు ఆచరించించేందుకు ఉదయమే భీమారం నుంచి సిర్వంచ మీదుగా వాహనాల్లో వెళ్లారు. మంచిర్యాల నుంచి కాళేశ్వరంకి నేరుగా ఆర్టీసీ ప్రత్యే బస్సులు నడిపిస్తున్నప్పటికీ భీమారంలో ఆపడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెన్నూర్: కాళేశ్వరానికి భక్తుల తాకిడి పెరిగింది. కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తులతో చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా మారింది. పుష్కరాలు ప్రారంభమై నాలుగు రోజులు అవుతుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పుష్కరాలలో పుణ్య స్నానాలు అచరించేందుకు తరలివెళ్లారు.

టైసన్ కప్ బాక్సింగ్ చాంపియన్‌గా మంచిర్యాల


చాంపియన్‌లుగా నిలిచిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఫస్ట్ టైసన్ కప్ ఈస్పైల్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మంచిర్యాల ఖేలో ఇండియా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను తీసుకున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేశ్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్ అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం

జన్నారం: అడవుల రక్షణలో భాగంగా అటవీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ తెలంగాణ నార్త్ కోఆర్డినేటర్ వెంకట్ అన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ ఆదేశాల మేరకు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ అధ్వర్యంలో రేంజ్ పరిధిలోని సెక్షన్, బీట్ అధికారులకు అవగాహన కల్పించారు. అటవీ చట్టాలు, కేసులు నమోదు చేసే విధానం, ఎలా కేసులు పెడితే శిక్షలు పడుతాయనే వివరాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తిరుపతి, శివశంకర్, సెక్షన్ అధికారులు హన్మంతరావు, రవి, తన్వీర్ పాషా బీట్, అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జంగా రాఘవరెడ్డి

మంచిర్యాలటౌన్: పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తను పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయదని, తాను కూడా అండగా ఉంటానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మంచిర్యాల నియోజకవర్గం కార్యకర్తల సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, చిన్నబ్బు రాంభోపాల్‌లు హాజరై పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, వారికి సముచిత స్థానాన్ని పార్టీ కల్పిస్తుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

పేదింటి ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అందులో భాగంగానే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు'


మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలను చేస్తే, సహించేది లేదని, అభివృద్ధి ఎవరి హయాంలో జరుగుతుందో ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో పర్యావరణానికి ముప్పు


అవగాహన కల్పిస్తున్న ఎస్సై

వేమనపల్లి: బీజీ–3, గ్లైసిల్ విత్తనాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. మండలంలోని ములకలపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం రైతులతో సమావేశమయ్యారు. అదే విధంగా గ్లైసిల్ గడ్డి మందు వాడకూడదని దీని వల్ల క్యాన్సర్‌తో పాటు పర్యావరణ సమస్యలు ఏర్పడుతాయన్నారు. అనంతరం గ్రామాల్లోని మందుల దుకాణాలు తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి వివరించారు.